BALAGAM TV
BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com
హైదరాబాద్ మంగళవారం 08 ఏప్రిల్ 2025 | www.balagamtv.com | పేజీలు 4

## ఏఐ సాయంతో నకిలీ వీడియోలు సృష్టించారు

- హైకోర్టులో తెలంగాణ ప్రభుత్వం పిటిషన్

**నవతెలంగాణ-హైదరాబాద్ బ్యూరో**

కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాల భూముల వ్యవహారంలో ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ - ఏఐ) సాయంతో నకిలీ వీడియోలు, ఆడియో క్లిప్పింగ్స్‌ను సృష్టించారని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ప్రభుత్వం తరపున న్యాయవాది మేనక గురుస్వామి వాదనలు వినిపించారు. భూమిని చదును చేసే క్రమంలో బుల్డోజర్లను చూసి జింకలు, నెమళ్లు పారిపోతున్నట్లు నకిలీ వీడియోలను సృష్టించారని పిటిషన్‌లో పేర్కొన్నారు. నకిలీ వీడియోలు సృష్టించిన వారిపై తగిన చర్యలు తీసుకునేలా ఆదేశించాలని ప్రభుత్వం న్యాయస్థానాన్ని కోరింది. ఈ పిటిషన్‌పై ఏప్రిల్ 24న వాదనలు వింటామని హైకోర్టు తెలిపింది.

# సింగపూర్‌తో కలిసి పనిచేసేందుకు సిద్ధం

- భవిష్యత్తు మొత్తం 'ఏఐ'దే
- ఎమర్జింగ్ టెక్నాలజీస్ హబ్‌గా తెలంగాణను తీర్చిదిద్దుతాం
- మంత్రి శ్రీధర్ బాబు
- 2 లక్షల మంది ఏఐ ఇంజినీర్లను తయారు చేయడమే ప్రభుత్వ లక్ష్యం
- సింగపూర్ కాన్సులేట్ జనరల్ బృందంతో భేటీ



**నవతెలంగాణ-హైదరాబాద్ బ్యూరో**

స్కిల్ డెవలప్ మెంట్, టెక్నాలజీ రంగాల్లో సింగపూర్ ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలంగాణ ఐటీ, పరిశ్రమల మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. భవిష్యత్తు మొత్తం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ దే అని అన్నారు. తెలంగాణ నుంచి రెండు లక్షల మంది ఏఐ ఇంజినీర్లను తయారు చేయడమే తమ లక్ష్యమని చెప్పారు. సింగపూర్ కాన్సులేట్ జనరల్ ఎడ్గర్ పాంగ్ నేతృత్వంలో ఆ దేశ ప్రతినిధులు శ్రీధర్ బాబును డా.బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో కలిశారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వారికి శ్రీధర్ బాబు వివరించారు. ఎమర్జింగ్ టెక్నాలజీస్ కు తెలంగాణను హబ్ గా మారుస్తున్నామని చెప్పారు. ఏఐ రంగంలో ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునేలా తెలంగాణ యువతను తీర్చిదిద్దుతామని తెలిపారు. అంతర్జాతీయ ప్రమాణాలతో ఫ్యూచర్ సిటీ, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీలను నెలకొల్పుతున్నామని చెప్పారు. ఏడాది వ్యవధిలోనే ఐటీ, హాస్పిటాలిటీతో పాటు ఇతర రంగాల్లో 70 గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు ప్రారంభమయ్యాయని తెలిపారు. పరిశ్రమల ఏర్పాటును కేవలం హైదరాబాద్ కే పరిమితం చేయకుండా... కరీంనగర్, వరంగల్ లాంటి నగరాలకు కూడా విస్తరిస్తున్నామని చెప్పారు.

తెలంగాణ నుంచి రెండు లక్షల మంది ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ఇంజినీర్లను తయారు చేయాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి అన్నారు. ఈ సందర్భంగా పలు కీలక అంశాలపై అవగాహన ఒప్పందం చేస్తున్నారు. తాజా నిర్ణయంతో రాష్ట్రంలో నిరుద్యోగ ఇంజనీర్లకు మేలు జరుగుతుందని మంత్రి తెలిపారు. ఎమర్జింగ్ టెక్నాలజీస్' కు హబ్ గా తెలంగాణను మార్చేందుకు తీసుకుంటున్న చర్యలను ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు సింగపూర్ ప్రతినిధులకు వివరించారు. ఈ రంగంలో ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునేలా తెలంగాణ యువతను తీర్చిదిద్దుతామన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో నెలకొల్పుతున్న ఫ్యూచర్ సిటీ, అక్కడే ఏర్పాటు చేయబోతున్న ఏఐ యూనివర్సిటీ గురించి తెలిపారు. ఫ్యూచర్ సిటీలో భాగస్వామ్యమయ్యేందుకు అనేక అంతర్జాతీయ సంస్థలు ముందుకొచ్చాయన్నారు.

గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ల(జీసీసీ)కు హబ్ గా హైదరాబాద్ మారుతుందని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. ఏడాది వ్యవధిలోనే ఐటీ, హాస్పిటాలిటీ, ఇతర రంగాలకు చెందిన 70 జీసీసీలు ప్రారంభమయ్యాయని చెప్పారు. తెలంగాణలో పారిశ్రామికాభివృద్ధికి తీసుకుంటున్న

మిగితా 2వ పేజీలో



## గ్రీన్ ఎనర్జీ, రీజినల్ రింగ్ రోడ్డు, మూసి పునర్జీవనం, విద్య ప్రభుత్వ ప్రాధాన్యత రంగాలు

**సింగపూర్ ప్రతినిధి బృందంతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు**

**నవతెలంగాణ-హైదరాబాద్ బ్యూరో**

గ్రీన్ పవర్, రీజనల్ రింగ్ రోడ్డు, మూసి పునర్జీవం, విద్య తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్యత రంగాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. సోమవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో సింగపూర్ కాన్సుల్ జనరల్ ప్రతినిధి బృందంతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సింగపూర్ కాన్సల్ జనరల్ ఎడ్గర్ పాంగ్ మాట్లాడుతూ తెలంగాణతో ఆర్థిక సంబంధాలు బలోపేతం చేసుకునేందుకు సింగపూర్ సంస్థలు ఆసక్తిగా ఉన్నాయని, డిప్యూటీ సీఎం సహకారం, సందేశం కావాలంటూ పాంగ్ కోరారు. గ్రీన్ ఎనర్జీ, రీజినల్ రింగ్ రోడ్డు, మూసి పునర్జీవనం, విద్య తమ ప్రభుత్వ ప్రాధాన్యత రంగాలని ఈ రంగాల్లో సింగపూర్ సంస్థలతో కలిసి పని చేసే అంశంపై చర్చించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆసక్తిగా ఉందని డిప్యూటీ సీఎం తెలిపారు. కొత్త గ్రీన్ పవర్ పాలసీలో భాగంగా సోలార్, హైడ్రో, పంపుడ్ స్టోరేజీ విభాగాలపై దృష్టి పెట్టినట్టు డిప్యూటీ సీఎం తెలిపారు. ఇంటర్నేషనల్ స్టాండర్డ్స్ తో రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మిస్తున్నట్టు సింగపూర్ ప్రతినిధి బృందానికి వివరించారు. ప్రతి పాఠశాలను 25 ఎకరాల విస్తీర్ణంలో నిర్మిస్తున్నాము ఇది రాష్ట్ర ప్రభుత్వ డ్రీమ్ ప్రాజెక్టు అని వివరించారు. తెలంగాణ రాష్ట్రం ఒక నగర రాజ్యం, అత్యధికంగా పట్టణాలున్నాయని పట్టణ అభివృద్ధి పైన రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెట్టినట్టు తెలిపారు. సమావేశంలో సింగపూర్ పొలిటికల్ కాన్సుల్ వైష్ణవి వాసుదేవన్, సింగపూర్ హై కమిషన్ ప్రథమ ఆర్థిక సెక్రటరీ, డిప్యూటీ సీఎం స్పెషల్ సెక్రటరీ కృష్ణ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## హెచ్‌సీయూ విద్యార్థులపై కేసుల ఉపసంహరణ

డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆదేశం

వివరాలు 2వ పేజీలో



## అమెరికాలో తుఫాను బీభత్సం...

- 17 మంది మృతి

**నవతెలంగాణ-హైదరాబాద్ బ్యూరో**

అమెరికా తూర్పు, మధ్య ప్రాంతాల్లో తుపానులు బీభత్సం సృష్టించాయి. ఈ విపత్తు కారణంగా కనీసం 17 మంది మరణించారని అధికారులు తెలిపారు. కెంటకీ, టెనెస్సీ, అలబామా ప్రాంతాలకు వాతావరణ శాఖ భారీ వర్షపాతం, ఆకస్మిక వరద హెచ్చరికలు జారీ చేసింది. టెనెస్సీ రాష్ట్రంలో తుపాను అతలాకుతలం చేసింది. ఈ ఒక్క రాష్ట్రంలోనే 10 మంది మరణించారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. కెంటకీలోని జెఫెర్సన్‌టౌన్‌లో టోర్నడో కారణంగా భవనాలు ధ్వంసమయ్యాయని ఓ మీడియా రిపోర్టర్ వెల్లడించారు. సామాజిక మాధ్యమాలు, స్థానిక మీడియాలో షేర్ చేసిన ఫోటోలలో అనేక రాష్ట్రాల్లో తుపాను కారణంగా ఇళ్లు పూర్తిగా దెబ్బతిన్నట్టు కనిపించింది. చెట్లు నేలకూలాయి, విద్యుత్ లైన్లు తెగిపడ్డాయి... కార్లు బోల్తా పడ్డాయి. PowerOutage.us వెబ్‌సైట్ ప్రకారం, ఐదు రాష్ట్రాల్లో దాదాపు 1,40,000 మంది వినియోగదారులకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. గ్లోబల్ వార్మింగ్ కారణంగా వాతావరణ నమూనాలు, జల చక్రం లయ దెబ్బదింటోందని, దీనివల్ల తరచుగా తీవ్రమైన వాతావరణ పరిస్థితులు ఏర్పడుతున్నాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. గత సంవత్సరం యునైటెడ్ స్టేట్స్‌లో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దేశం అనేక టోర్నడోలు మరియు విధ్వంసకరమైన హరికేన్‌ల తాకిడికి గురైంది.



## భారీగా గ్యాస్ ధరల పెంపు

- వంట గ్యాస్ సిలిండర్‌పై రూ. 50 పెంచిన కేంద్రం
- కేంద్రమంత్రి హర్దీప్ సింగ్ పూరి ప్రకటన
- నేటి నుంచే కొత్త ధరలు అమల్లోకి

**నవతెలంగాణ-హైదరాబాద్ బ్యూరో**


వంట గ్యాస్ ధరను పంపిణీ సంస్థలు సిలిండర్‌కు రూ.50 పెంచాయని కేంద్రమంత్రి హర్‌దీప్ సింగ్ పూరి సోమవారం వెల్లడించారు. జనరల్ కేటగిరీ వినియోగదారులతో పాటు ఉజ్వల పథక లబ్ధిదారులకు కూడా ఈ పెంపు వర్తిస్తుందన్నారు. రేపటి నుంచే కొత్త ధరలు అమల్లోకి వస్తాయని మంత్రి తెలిపారు. ఈ పెంపుతో 14.2 కిలోల ఎల్‌పీజీ సిలిండర్ ధర సాధారణ వినియోగదారులకు రూ. 803 నుంచి రూ. 853కు, ఉజ్వల్ సిలిండర్ రూ. 503 నుంచి రూ. 553కు చేరనుంది. అటు... పెట్రోల్, డీజిల్‌పై లీటర్‌కు రూ. 2 చొప్పున ఎక్సైజ్ డ్యూటీని పెంచగా, ఆ భారాన్ని చమురు కంపెనీలే భరించనున్నాయి.

## పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ డ్యూటీ పెంపు

- పెట్రోల్, డీజిల్‌పై రూ.2ను పెంపు

వివరాలు 2వ పేజీలో

## కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంపై విచారణ 24కు వాయిదా




**నవతెలంగాణ-హైదరాబాద్ బ్యూరో**

కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంపై హైకోర్టులో విచారణ జరిగింది. సుప్రీంకోర్టులో కేసు విచారణ దృష్ట్యా ఈ నెల 24లోపు కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులను హైకోర్టు ఆదేశించింది. స్టేటస్ రిపోర్ట్ ఫైల్ చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించాలని కేంద్రం తరపు న్యాయవాది కోరారు. నకిలీ వీడియోలపై పోలీసులు కౌంటర్ దాఖలు చేస్తారని ప్రభుత్వ న్యాయవాది అన్నారు. విచారణను ఈ నెల 24కు వాయిదా వేసింది.

కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంపై రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. కృత్రిమ మేధ సాయంతో నకిలీ వీడియోలు సృష్టించి ప్రచారం చేశారని పిటిషన్‌లో పేర్కొంది. ప్రభుత్వం తరఫున సుప్రీంకోర్టు న్యాయవాది మేనక గురుస్వామి వాదనలు వినిపించారు. మొత్తం 400 ఎకరాలకు సంబంధించిన నకిలీ వీడియోలు, ఆడియో క్లిప్పింగ్స్ తయారు చేశారని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. భూమిని చదును చేసే క్రమంలో బుల్డోజర్లను చూసి నెమళ్లు, జింకలు పారిపోతున్నట్లు నకిలీ వీడియోలు సృష్టించారని పిటిషన్‌లో పేర్కొంది. నకిలీ వీడియోలు సృష్టించిన వారిపై తగిన చర్యలు తీసుకునేలా ఆదేశించాలని రాష్ట్ర ప్రభుత్వం న్యాయస్థానాన్ని కోరింది. పిటిషన్‌పై ఈ నెల 24న వాదనలు వింటామని హైకోర్టు వెల్లడించింది.

## ఆర్టీసీలో సమ్మె సైరన్..



- మే 6 అర్ధరాత్రి నుంచి విధులు బహిష్కరణ
- హామీలు నెరవేర్చాలని డిమాండ్

**నవతెలంగాణ-హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ ఆర్టీసీ సమ్మె సైరన్ మోగనుంది. మే 6వ తేదీ అర్ధరాత్రి నుంచి సమ్మె చేయాలని ఆర్టీసీ జేఏసీ నిర్ణయించింది. ఈ మేరకు సంస్థ ఎండీ సజ్జనార్, లేబర్ కమిషనర్ కు ఆర్టీసీ జేఏసీ నేతలు సమ్మె నోటీసులు ఇచ్చారు. మే 7వ తేదీ మొదటి డ్యూటీ నుంచి విధులు బహిష్కరిస్తున్నట్లు నోటీసుల్లో తెలిపారు. కాంగ్రెస్ తన ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని వారు డిమాండ్ చేశారు. ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే ఎంత దూరమైనా వెళ్తామని హెచ్చరించారు. మరో నెల రోజుల్లో తమ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకపోతే సమ్మెకు వెళ్తామని కార్మిక సంఘాలు హెచ్చరించాయి. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. డిమాండ్ల పరిష్కారంపై గత రెండు మూడు నెలలుగా కార్మిక సంఘాలు కోరుతున్నా.. ఆర్టీసీ యాజమాన్యం నుంచి కానీ ప్రభుత్వం నుంచి కానీ సానుకూల స్పందన రాకపోవడంతో వచ్చే నెల 6వ తేదీ అర్ధరాత్రి నుంచి ఆర్టీసీ కార్మికులు సమ్మెలో పాల్గొనాలని జేఏసీ తీర్మానం చేసింది. ఈ క్రమంలోనే ఆర్టీసీ ఎండీకి సమ్మె నోటీసులు ఇచ్చారు.

21 డిమాండ్లలో ప్రధానంగా ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం, ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణించడం ఉన్నాయి. దీనిపై ప్రభుత్వం ఇప్పటివరకు ప్రక్రియ ప్రారంభించలేదు. మరోవైపు ఆర్టీసీ ఉద్యోగులకు నెల నెల జీతాలు ఇవ్వడంలో జాప్యం జరుగుతోందన్న ఆరోపణలు ఉన్నాయి. వేతన సవరణ జరిగినా అరియర్స్ ఇప్పటివరకు ఇవ్వలేదని వాపోయారు. ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగానే బకాయిలు అందడం లేదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే ఆర్టీసీ కార్మికులపై పని భారం పెరిగిపోయిందన్నారు. ఈ సమస్యలన్నింటిని పరిష్కరించాలని కార్మిక సంఘాలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాయి.




## ఏడుగురు కొత్త ఎమ్మెల్సీల ప్రమాణ స్వీకారం

**నవతెలంగాణ-హైదరాబాద్ బ్యూరో**

ఇటీవల తెలంగాణ రాష్ట్రంలో జరిగిన రెండు టీచర్స్, ఒక గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం సాధించిన ఎమ్మెల్సీలు తెలంగాణ శాసన మండలిలో ప్రమాణ స్వీకారం చేశారు. నాటి ఎన్నికల్లో బీజేపీ నుంచి మల్కా కొమురయ్య, అంజిరెడ్డి ప్రమాణ స్వీకారం చేయగా.. మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి వారితో ప్రమాణ స్వీకారం చేశారు. ఈసందర్భంగా బీజేపీ నుంచి కిషన్ రెడ్డి, లక్ష్మణ్, రఘునందన్ రావులు పాల్గొన్నారు. అలాగే ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీలుగా కాంగ్రెస్ నుంచి ఏకగ్రీవంగా ఎన్నికైన విజయశాంతి, అద్దంకి దయాకర్, శంకర్ నాయక్, నెల్లికంటి సత్యంలతో మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ నుంచి మంత్రులు శ్రీధర్ బాబు, ఉత్తమ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. అలాగే నల్గొండ- ఖమ్మం- వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పీఆర్టీయూ అభ్యర్థి శ్రీపాల్ రెడ్డి ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేశారు.

## సెన్సెక్స్ ఏకంగా 2,226 పాయింట్లు పతనం

- రూ. 19 లక్షల కోట్ల సంపద హుష్ కాకి...



**నవతెలంగాణ-హైదరాబాద్ బ్యూరో**

భారత స్టాక్ మార్కెట్లు సోమవారం కుప్పకూలాయి. ప్రపంచ మార్కెట్‌లో ప్రతికూల పవనాల నేపథ్యంలో మార్కెట్లు కుదేలయ్యాయి. ట్రంప్ ప్రతీకార సుంకాలపై చైనా సైతం పన్నులు ప్రకటించింది. ప్రపంచ వాణిజ్య యుద్ధం తప్పదనే సంకేతాల మధ్య భయాందోళనలు పెరిగాయి. దానికి తోడు అమెరికాలో మాంద్యం భయాలు ఎక్కువయ్యాయి. దాంతో పెట్టుబడిదారుల సెంటిమెంట్ దెబ్బతిన్నది. ఫలితంగా మార్కెట్‌లో భారీగా అమ్మకాలు జరిగాయి. సెన్సెక్స్ మూడుశాతానికిపైగా నష్టపోయింది. సెన్సెక్స్. నిఫ్టీ దాదాపు పదినెలల కనిష్ఠానికి చేరాయి. నిఫ్టీలో లిస్టయిన కంపెనీల విలువ రూ.20లక్షల కోట్ల వరకు పతనమైంది. క్రితం సెషన్ (శుక్రవారం ముగింపు 75,364.69) తో పోలిస్తే సెన్సెక్స్ 71,449.94 పాయింట్ల వద్ద నష్టాల్లో మొదలైంది. మార్కెట్ ప్రారంభంలోనే సెన్సెక్స్ దాదాపు 4వేల పాయింట్ల దాకా పతనమైంది. కేవలం పది సెకన్లలోనే మార్కెట్‌లో రూ.18లక్షల కోట్ల మదుపరుల సంపద ఆవిరైంది. ఇంట్రాడేలో 73,403.99 పాయింట్ల గరిష్ఠానికి చేరిన సెన్సెక్స్.. అత్యల్పంగా 71,425.01 పాయింట్ల కనిష్ఠానికి చేరుకుంది.

చివరకు 2,226.79 పాయింట్ల నష్టంతో 73,137.90 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం ఇదే బాటలో కొనసాగింది. ప్రారంభంలోనే వెయ్యి పాయింట్లకుపైగా పతనమైంది. చివరకు 742.85 పాయింట్ల నష్టంతో 22,161.60 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్, నిఫ్టీ దాదాపు పది నెలల తర్వాత కనిష్ఠానికి చేరుకున్నాయి. ముఖ్యంగా నిఫ్టీ 2020 మార్చి తర్వాత భారీగా పతనమైంది. మార్కెట్‌లో దాదాపు 559 షేర్లు పురోగమించగా, 3,372 షేర్లు కుప్పకూలాయి. నిఫ్టీ అత్యధికంగా ట్రెంట్, టాటా స్టీల్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, హిందాల్కో ఇండస్ట్రీస్, శ్రీరామ్ ఫైనాన్స్, ఎల్‌అండ్‌టీ నష్టపోయాయి. హిందుస్థాన్ యూనిలీవర్ లాభపడింది. ఇక మార్కెట్‌లో మెటల్ ఇండెక్స్ 6.7 శాతం, రియల్టీ ఇండెక్స్ 5.6 శాతం, మీడియా, పీఎస్‌యూ బ్యాంక్, ఆటో, ఎనర్జీ, ఐటీ 2.5 నుంచి 4 శాతం తగ్గడంతో అన్ని రంగాల సూచీలు నష్టాల్లో ముగిశాయి. బీఎస్‌ఈ మిడ్‌క్యాప్, స్మాల్ క్యాప్ సూచీలు

మిగితా 2వ పేజీలో

## బనకచర్ల ప్రాజెక్టుపై తెలంగాణ ఆగ్రహం

- అనుమతుల్లేకుండా ఎలా చేపడతారు ?: జీఆర్ఎంబీని ప్రశ్నించిన తెలంగాణ
- డీపీఆర్ తయారు కాలేదు: ఏపీ కార్యదర్శి అజగేషన్‌పై ఫిర్యాదు

వివరాలు 2వ పేజీలో

# యువతను నైపుణ్య మానవ వనరులుగా తీరిదిద్దుతాం

**- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు**



**బలగం టీవి, హైదరాబాద్**

పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా తెలంగాణ యువతను అన్ని రంగాల్లో అత్యుత్తమ నైపుణ్య మానవ వనరులుగా తీర్చి దిద్దుతామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. సోమవారం గచ్చిబౌలిలోని ఇంజినీరింగ్ స్టాఫ్ ఆఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా(ఈఎస్ఐసీ)లో ఏర్పాటు చేసిన యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్శిటీ ప్రాంగణాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం యూనివర్సిటీ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. అత్యుత్తమ నైపుణ్య మానవ వనరులకు చిరునామాగా తెలంగాణను మార్చాలనే సంకల్పంతోనే యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామన్నారు. తెలంగాణ యువతలో ప్రతిభకు కొదవ లేదని మార్కెట్ అవసరాలకు అనుగుణంగా స్కిల్ డెవలప్మెంట్‌లో శిక్షణ అందిస్తే మరింత మెరుగ్గా తయారవుతారన్నారు. పరిశ్రమలతో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ కోర్సుల రూపకల్పనలో పరిశ్రమలను భాగస్వామ్యం చేయాలని సూచించారు. డిమాండ్ ఎక్కువగా ఉన్న కోర్సులపై ప్రధానంగా దృష్టి సారించాల న్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే అభ్యర్థులకు సాఫ్ట్ స్కిల్స్ లో ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని సూచించారు. కోర్సు పూర్తయ్యే నాటికి అభ్యర్థులను పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా తీర్చి దిద్దాలన్నారు. రాష్ట్రంలోని ప్రముఖ విద్యా, పరిశోధన, టాస్క్, డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజ్ ఆఫ్ తెలంగాణ(డీఈఈటీ) తదితర సంస్థలతో సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో స్పెషల్ సీఎస్ జయేష్ రంజన్, డిప్యూటీ సెక్రటరీ భవేష్ మిశ్రా, స్కిల్ యూనివర్సిటీ వీసీ సుబ్బారావు, ఇఎస్‌సీఐ డైరెక్టర్ డాక్టర్.జీ.రామేశ్వర్‌రావు, ఓఎస్డీ చమాన్ మెహతాతోపాటు తదితరులు పాల్గొన్నారు.

# హెచ్‌సీయూ విద్యార్థులపై కేసుల ఉపసంహరణ

**డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆదేశం**

**బలగం టీవి, హైదరాబాద్**

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులపై నమోదు చేసిన కేసులను వెంటనే ఉపసంహరించా లని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పోలీసులను ఆదేశించారు. సోమవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఉపాధ్యాయ, సివిల్ సొసైటీ సంఘాల ప్రతినిధులతో సబ్‌కమిటీ సభ్యులైన మంత్రులు డి.శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌తో కలిసి జరిపిన చర్చల అనంతరం భట్టి ఆదేశాలు జారీ చేశారు. జ్యూడీషియల్ రిమాండ్‌లో ఉన్న ఇద్దరు విద్యార్థులకు సంబంధించి కేసుల ఉపసంహరణకు వెంటనే చర్యలు చేపట్టాలని సూచించారు. కేసుల ఎత్తివేతలో న్యాయపరమైన సమస్యలు ఉత్పన్నం కాకుండా పోలీస్ అధికారులకు తగు సూచనలు చేయవలసిందిగా న్యాయశాఖ అధికారులను ఆదేశించారు. అంతకు ముందు సబ్‌కమిటీతో జరిగిన సమావేశంలో హైదరాబాద్ విశ్వవిద్యాలయ ఉపాధ్యాయ సంఘం (యూహెచ్‌టీఏ) పౌర సంఘాల ప్రతినిధులు సమావేశమై పలు డిమాండ్లను మంత్రుల కమిటీ దృష్టికి తెచ్చారు. ప్రతిపాదిత డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చకపోవడంతో విద్యార్థి జాయింట్ యాక్షన్ కమిటీ ఈ సమావేశానికి హాజరు కాలేదని సివిల్ సొసైటీ సభ్యులు పేర్కొన్నారు.

డిమాండ్లు నెరవేర్చిన తర్వాతే విద్యార్థులు మంత్రుల కమిటీ నిర్వహించే సమావేశానికి హాజరవుతారని వారు సబ్‌కమిటీకి తేల్చిచెప్పారు. ఈ సమావేశంలో, కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ప్రత్యేక ఆహ్వానితులు వంశీచందర్ రెడ్డి, హెచ్‌సీయూ ఉపాధ్యాయ సంఘం ప్రతినిధులు ప్రొఫెసర్ సౌమ్య దేచమ్మ, ప్రొఫెసర్ శ్రీపర్ణదాస్, ప్రొఫెసర్ భంగ్య భూక్య, పౌర సంఘాల ప్రతినిధులు విస్సా కిరణ్‌కుమార్, సంధ్య, సజయ, ఇమ్రాన్ సిద్ధిఖీ తదితరులు పాల్గొన్నారు.

# సెన్సెక్స్ ఏకంగా 2,226 పాయింట్లు పతనం

(మొదటి పేజీ తరువాయి)

వరుసగా 3.4 శాతం నుంచి 4 శాతం చొప్పున తగ్గాయి. మరో వైపు ఆసియా మార్కెట్లు సైతం భారీ నష్టాల్లో కొనసాగాయి. 2008 తర్వాత ఆసియా మార్కెట్లు భారీగా నష్టపోయాయి. మాంద్యం భయాలు మెటల్ కంపెనీల షేర్లు భారీగా నష్టాలను చవిచూశాయి.

స్టాక్ మార్కెట్లు సోమవారం భారీగా నష్టపోయాయి. సెన్సెక్స్ దాదాపు 2000 పాయింట్లు పైగా నష్టపోయింది. అదే సమయంలో నిఫ్టీ కూడా 700 పాయింట్లకు పైగా నష్టపోయింది. ఆసియా మార్కెట్లలో నెలకొన్నటువంటి నష్టాల పరంపర ఈరోజు దేశీయ మార్కెట్లను సైతం తాకింది. దాదాపు అన్ని షేర్లలో అమ్మకాల ఒత్తిడి కొనసాగింది. నిఫ్టీ సూచీలో దాదాపు అన్ని షేర్లు రెడ్ లో ముగిసాయి.

# బీఆర్ఎస్ నేత క్రిశాంక్‌కు నోటీసులు

**బలగం టీవి, హైదరాబాద్**

కంచ గచ్చిబౌలి భూములపై ఏఐని ఉపయోగించి కొన్ని సోషల్ మీడియాలో సర్క్యూలేట్ చేయడంపై గచ్చిబౌలి పోలీసులు కేసులు నమోదు చేశారు. అందులో భాగంగా బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్‌కు పోలీసులు నోటీసులు ఇచ్చారు. కంచ గచ్చిబౌలి భూముల్లో ఏఐ ఉపయోగించి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారని క్రిశాంక్‌కు పోలీసులు నోటీసులు అందజేశారు. ఈనెల 9 , 10 , 11 న గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌కు విచారణకు రావాలని నోటీసుల్లో పేర్కొన్నారు

**కాంగ్రెస్ డ్యామేజ్ కంట్రోల్ చేయడం ప్రారంభించింది : మన్నె క్రిశాంక్**

కాంగ్రెస్ డ్యామేజ్ కంట్రోల్ చేయడం ప్రారంభించిందని బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్ తెలిపారు. తాను చేసిన పోస్టుల్లో ఎక్కడా కూడా ఏఐని వాడలేదని స్పష్టం చేశారు. ఇటీవల హెచ్‌సీయూ విడుదల చేసిన ఫొటోలు, వీడియోలు అన్నీ వాస్తవమే అని పేర్కొన్నారు. దీనిపై న్యాయపరంగా ఎదుర్కొంటామని చెప్పారు. జింకలు ఎందుకు రోడ్ల మీదకు వచ్చాయి.. ఇళ్లలోకి ఎందుకు వెళ్లాయి.. అవన్నీ వీడియోలు ఉన్నాయని క్రిశాంత్ తెలిపారు. అక్కడ జింకలు లేవు, నక్కలు ఉన్నాయని అంటున్నారని విమర్శించారు. కంచె గచ్చిబౌలి భూముల్లోకి ఎవరూ రావవద్దని ఆంక్షలు పెట్టారని.. ఇప్పుడు ఏఐతో వీడియోలు సృష్టించారని అబద్ధాలు చెబుతున్నారని మండిపడ్డారు. అసలు ఏఐ గురించి మాట్లాడే అర్హత కాంగ్రెస్‌కు ఉందా అని ప్రశ్నించారు. నిజంగానే అక్కడ జింకలు, నెమ్మళ్లు ఉన్నాయని జాతీయ స్థాయిలో నిరూపితమైందని తెలిపారు. అయినప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం తనపై నాలుగు కేసులు పెట్టిందని విమర్శించారు. జింకలు చనిపోవడానికి కారణమెవరు? ఆ చెట్లను నరకడానికి కారణం ఎవరని మన్నె క్రిశాంక్ ప్రశ్నించారు. వీటికి కారణం ఎవరైనా వారిపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అక్కడ జింకలు లేవని అందరితో వీడియోలు పెట్టిస్తున్నారని.. ఒక్కొక్కరికీ రూ.20 వేలు ఇచ్చి రీల్స్ చేయిస్తున్నారని మండిపడ్డారు.

# సింగపూర్‌తో కలిసి పనిచేసేందుకు సిద్ధం

(మొదటి పేజీ తరువాయి)

చర్యలను మంత్రి వివరించారు. పరిశ్రమల ఏర్పాటును ఒక్క హైదరాబాద్ కే పరిమితం చేయకుండా%ా% వరంగల్, కరీంనగర్ లాంటి ఇతర నగరాలకు విస్తరించేలా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తున్నామన్నారు. తెలంగాణలో పరిశ్రమల ఏర్పాటుకున్న అనుకూలతలపై స్థానిక పారిశ్రామికవేత్తలకు అవగాహన కల్పించాలని ప్రతినిధుల బృందాన్ని కోరారు. టెక్నాలజీ, స్కిల్ డెవలెప్ మెంట్, ఇతర అంశాల్లో సింగపూర్ ప్రభుత్వంతో కలిసి పని చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో కాన్సూల్ వైష్ణవి వాసుదేవన్, ఫస్ట్ సెక్రటరీ(ఎకానమిక్) వివేక్ రఘు రామన్, ఎంటర్ ప్రైజ్ సింగపూర్ రీజినల్ డైరెక్టర్(ఇండియా- సౌత్) డేనిస్ టాం తదితరులు పాల్గొన్నారు.

# పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ డ్యూటీ పెంపు

- **పెట్రోల్, డీజిల్‌పై రూ.2ను పెంపు**

**బలగం టీవి, హైదరాబాద్**

ఎ వాహనదారులకు కేంద్ర ప్రభుత్వం షాకిచ్చింది పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ డ్యూటీని 2 రూపాయలు పెంచింది. ఈ పెంపు దేశవ్యాప్తంగా అమలులోకి రానుంది. ప్రస్తుతం హైదరాబాద్‌లో లీటర్ పెట్రోల్ ధర రూ.107.66, డీజిల్ ధర రూ.95.82గా ఉంది. ఎక్సైజ్ డ్యూటీ పెరగడంతో లీటర్ పెట్రోల్ ధర రూ.109.66, డీజిల్ ధర రూ.97.82కు చేరనుంది. ఇక విజయవాడలో లీటర్ పెట్రోల్ ధర రూ.109.76, డీజిల్ ధర రూ.97.51గా ఉంది. పెరిగిన ఎక్సైజ్ డ్యూటీతో పెట్రోల్ ధర రూ.111.76, డీజిల్ ధర రూ.99.51 కానుంది. మరోవైపు అమెరికా -చైనా ట్రేడ్ వార్, ఆర్థిక మాంద్యం భయాలు, ఒపెక్ ప్లస్ ఉత్పత్తి పెంపు వంటి అంతర్జాతీయ ఆర్థిక భయాల నేపథ్యంలో కొంతకాలంగా క్రూడాయిల్ ధరలు భారీగా పతనం అవుతున్నాయి. వారం వ్యవధిలోనే సుమారు 10 డాలర్ల వరకు తగ్గి.. ఇప్పుడు మూడేళ్ల కనిష్ట సాయికి చేరింది. అయినప్పటికీ దేశీయంగా పెట్రోల్, డీజిల్ ధరల్లో ఎలాంటి తగ్గింపు జరగలేదు. అంతర్జాతీయంగా ముడి చమురు ధరల తగ్గింపు నేపథ్యంలో ఇప్పటికైనా పెట్రోల్ ధరలు తగ్గుతాయేమోనని ఎదురుచూస్తున్న సామాన్యులపై కేంద్ర ప్రభుత్వం ఎక్సైజ్ డ్యూటీ పెంపు పేరుతో షాకిచ్చింది. పెట్రోల్, డీజిల్‌పై రూ.2ను పెంచింది.

# బనకచర్ల ప్రాజెక్టుపై తెలంగాణ ఆగ్రహం

- **అనుమతుల్లేకుండా ఎలా చేపడ తారు ?: జీఆర్ఎంబీని ప్రశ్నించిన తెలంగాణ**
- **డీపీఆర్ తయారు కాలేదు: ఏపీ కార్యదర్శి అజగేషన్‌పై ఫిర్యాదు**

**బలగం టీవి, హైదరాబాద్**

గోదావరి-బనకచర్ల ప్రాజెక్టును అనుమతుల్లేకుండా ఆంధ్రప్రదేశ్ ప్రభు త్వం తలపెట్టిందని తెలంగాణ ప్రభుత్వం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆ ప్రాజెక్టు సమాచారంతోపాటు ఇతర అంశాలను దాస్తున్నదని నిరసన వ్యక్తం చేసింది. దీనిపై జీఆర్ఎంబీకి, కేంద్రానికి తెలంగాణ ప్రభుత్వం లేఖలు రాసిందనీ, అయినా పట్టించుకోకపోవడం సరికాదని వ్యాఖ్యా నించింది. సోమవారం హైద రాబాద్‌లోని సాగునీటి శాఖ ప్రధాన కార్యాలయం జలసౌధలో గోదావరి నదీ యాజమాన్య బోర్డు(జీఆర్ఎంబీ) సమావేశం

చైర్మెన్ ఏకే ప్రధాన్ అధ్యక్షతన జరిగింది. దీనికి రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్య అధికారులు హాజరయ్యారు. ఇందులో ఏపీ, తెలంగాణ అధికారుల మధ్య వాదనలు వాడీవేడిగా సాగాయి. ఈ సందర్భంగా బనకచర్ల ప్రాజెక్టు, తెలంగాణపై దాని ప్రభావం, జీఆర్ఎంబీ కార్యదర్శి అజగేషన్ ప్రవర్తన, ఇతర అంశాలు చర్చకొచ్చాయి. బనకచర్ల ప్రాజెక్టు విషయంలో తెలంగాణ జీఆర్ఎంబీని తీవ్రంగా ప్రశ్నించింది. ఏపీ సర్కారును తప్పుబట్టింది. గోదావరి-బనకచర్ల అనుసంధానాన్ని వ్యతిరేకిస్తూ తెలంగాణ వాదనలు వినిపించింది. రూ.80 వేల కోట్లతో ప్రాజెక్టు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారని తెలియజేసింది. 180టీఎంసీల మిగులు జలాలను తరలించాలనే లక్ష్యంతో ఏపీ సర్కారు పని చేస్తున్నదని గుర్తు చేసింది. అలాగే ఈ ప్రాజెక్టు కోసం నాగార్జునసాగర్ కుడికాలువ సామర్థ్యాన్ని పెంచేందుకు ప్రయత్నాలు చేస్తున్నదని విమర్శించింది. ఈ విషయమై కేంద్ర ప్రభుత్వం జీఆర్ఎంబీకి లేఖ రాసినా పట్టించుకోకపోవడంపై నిరసన వ్యక్తం చేసింది. ఏపీ సర్కారు సమాచారంతోపాటు ఇతర వివరాలను దాచిపెడుతున్నదని తెలంగాణ నీటిపారుదల శాఖ అధికారులు జీఆర్ఎంబీ చైర్మెన్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రాజెక్టు అంశంపై బోర్డుకు కేంద్రం నుంచి లేఖ వచ్చి దాదాపు ఐదు నెలలు కావస్తున్నా పట్టించుకోలేదన్నారు. లేఖ వచ్చిన సంగతిని కూడా తెలంగాణకు చెప్పకుండా బోర్డు నిర్లక్ష్యం చేసిందని గుర్తు చేశారు. బనకచర్ల ప్రాజెక్టు పూర్తి వివరాలు, దాని మూలంగా తెలంగాణపై ప్రభావం తదితర వివరాలను ఏపీ ప్రభుత్వం అందించాలని తెలంగాణ అధికారులు బోర్డును కోరారు. ఈ మేరకు ఆ రాష్ట్రానికి ఆదేశాలివ్వాలని తెలంగాణ నీటిపారుదల శాఖ ముఖ్యకార్య దర్శి రాహుల్ బొజ్జా సూచించారు. అనుమతులు లేకుండా ప్రాజెక్టు చేపడుతున్నారని తెలంగాణ అధికారులు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీనిపై ఏపీ అధికారులు స్పంది స్తూ బనకచర్ల ప్రాజెక్టుకు ఇంకా డీపీఆర్ తయారు చేయలేదని వివరణ ఇచ్చారు. తాము ఎలాంటి పనులు చేయడం లేదని ఏపీ ఈఎన్సీ వెంకటేశ్వర్‌రావు తెలియజేశారు. మరోవైపు తెలంగాణలో పెద్దవాగు ప్రాజెక్టు ఆధునీకరణ పనులపై సమావేశంలో చర్చించారు. రూ. 15 కోట్లతో తక్షణ మరమ్మతులు చేయాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా జీఆర్ఎంబీ కార్యదర్శి అజగేషన్ వ్యవహార శైలిని తెలంగాణ అధికారులు ప్రస్తావించారు. రాష్ట్రాలను సంప్రదించకుండానే బోర్డు సమావేశాలను నిర్వహిస్తున్నారని విమర్శించారు. అంతేకాకుండా జీఆర్ఎంబీలో డిప్యూటేషన్‌పై పని చేస్తున్న ఏపీ, తెలంగాణకు చెందిన అధికారులను అజగేషన్ వేధిస్తున్నారనీ, మహిళా ఉద్యోగులను అసభ్యకర మాటలతో దూషిస్తున్నారని ఫిర్యాదు చేశారు. ఆయనపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో తెలంగాణ నీటిపారుదల శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# పదిర, కొండాపూర్ ఇసుక రీచ్ లు ప్రారంభించాలి

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝ



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

పదిర, కొండాపూర్ ఇసుక రీచ్ లు మంగళవారం నుండి ప్రారంభించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా సమీకృత జిల్లా కలెక్టరేట్ లో ఇసుక రీచ్ ల ఏర్పాటు పై అధికారులతో కలెక్టర్ సందీప్ కుమార్ ఝ జిల్లా స్థాయి సాండ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ పదిర రీచ్ నుంచి ఇసుక రవాణా కోసం అవసరమైన అనుమతులు అందించాలని,జిల్లాలో మానేరు నది నూతనంగా గుర్తించిన 6 ఇసుక రీచ్ ల ప్రస్తుత స్థితి గతి పై చర్చించారు.

కొండాపూర్ వద్ద ఇసుక కమిటీ సభ్యులు అందించిన నివేదిక ప్రకారం ఒక ఇసుక రీచ్ నుంచి ఇసుక తరలింపుకు చర్యలు తీసుకోవాలని, పదిర ఇసుక రిచ్ ప్రారంభించిన తర్వాత వెంకటాపూర్ ఇసుక రిచ్ నిలుపు దలకు చర్యలు చేపట్టాలని అన్నారు. కొండాపూర్ మధిర ఇసుక రీచ్ ల ప్రారంభించిన తర్వాత మరోసారి సమావేశం నిర్వహించాలని అన్నారు.

వట్టిమలాలో అప్రోచ్ రోడ్ సమస్యపై సంబంధిత మండల తహసిల్దార్ నివేదిక అందించాలని అన్నారు.నేటి నుంచి కొండాపూర్ 1, పదిర ఇసుక రీచ్ ప్రారంభం కావాలని దీనికి సంబంధించిన మంజూరు పత్రాలు జారీ చేయాలనిఅన్నారు. సిరిసిల్ల జిల్లాలో నూతనంగా నిర్మించే ప్రభుత్వ ప్రాజెక్టులు, ఇందిరమ్మ ఇండ్లు, పెండింగ్ డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణానికి ఎక్కడ ఇసుక కొరత రాకుండా అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, సిరిసిల్ల ఇన్చార్జి ఆర్.డి.ఓ రాధా భాయి, మైనింగ్ అధికారి క్రాంతి కుమార్, జిల్లా పంచాయతీ అధికారి శరిపుద్దిన్, ప్రోగ్రాం అధికారి టిజిఎండిసి జైపాల్ రెడ్డి, నీటిపారుదల శాఖ అధికారి అమరేందర్ రెడ్డి, సిబ్బంది, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## సన్నబియ్యం బువ్వ మంచిగా ఉన్నదా..

**-పేదవారికి సన్న బియ్యంతో కడుపునిండా భోజనం**

**- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

**బలగం టీవీ, వేములవాడ**

సన్న బియ్యం బువ్వ ఎట్లా ఉంది,మంచిగా ఉన్నదా, లబ్ధిదారుడి కుటుంబ సభ్యులను ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ అడిగి తెలుసుకున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం నిమ్మపల్లి గ్రామం జేసేవలాల్ తండా లో సన్న బియ్యం లబ్ధిదారుడు గిరిజన బిడ్డ ఇస్లావత్ మధుకర్ ఇంట్లో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ వారి కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ సన్ను బియ్యంతో పేదవారు రెండు పూటలా భోజనం చేస్తున్నారని అన్నారు. దొడ్డు బియ్యం పంపిణీ చేసినపుడు అసలు వాటిని తీసుకునేందుకే ఆసక్తి చూపేవాళ్లం కాదని,ఇప్పుడు సన్నబియ్యం ఇవ్వడంతో కుటుంబానికి ఉపయోగంగా ఉంటుందని సంతోషం వ్యక్తం చేస్తున్నారని అన్నారు.తండా పరిధిలో అనాడు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అందించిన మంచి నీరు ఇప్పటికి తాగుతున్నమని తెలిపారని,తామంతా ఏప్పటికి కాంగ్రెస్ పార్టీకి రుణపడి ఉంటామని ఆనందం వ్యక్తం చేశారని అన్నారు.





## జిల్లా ఉత్తమ రైతు పురస్కారం

**బలగం టీవీ, బోయినిపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లా మండలం తడగొండ గ్రామానికి చెందిన సింగిల్ విండో డైరెక్టర్ గుడి శ్రీనివాస్ రెడ్డికి ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలో గల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, పొలస జగిత్యాలలో జరిగిన ఉత్తర తెలంగాణ మండల వ్యవసాయ పరిశోధన విస్తరణ సలహా సమావేశంలో వ్యవసాయంలో తాను పాటిస్తున్న నూతన పద్ధతులకు,ఇతర రైతులకు వ్యవసాయ, వ్యవసాయేతర అంశాలలో సలహాలు సూచనలు ఇస్తూ, వారి సామాజిక ఆర్థిక స్థితి గతులను మెరుగు పడడంలో తోడ్పడినందుకు రాజన్న సిరిసిల్ల జిల్లా ఉత్తమ రైతు పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డిని రైతు సంఘాలు, గ్రామస్తులు అభినందించారు.

# ప్రతి చిన్నారికి కంటి వైద్య పరీక్షలు చేయాలి

**- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**



**బలగం టీవీ,తంగళ్లపల్లి**

అంగన్వాడి కేంద్రాల్లో చదివే ప్రతి చిన్నారికి కంటి వైద్య పరీక్షలు చేయాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా బ్లైండ్ నెస్ ప్రివెన్షన్ వీక్ అందత్వ నివారణ వారోత్సవాలను పురస్కరించుకొని జిల్లాలోని అన్ని అంగన్వాడి కేంద్రాల్లోని 06 నెలల నుంచి 06 ఏండ్లలోపు పిల్లలందరికీ కంటి వైద్య పరీక్షలు నిర్వహించే కార్యక్రమాన్ని తంగళ్లపల్లి మండలంలోని బస్వాపూర్ లో సోమవారం ఏర్పాటు చేయగా, ముఖ్య అతిథిగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా హాజరయ్యి ప్రారంభించారు. వైద్య పరీక్షలు చేస్తున్న విధానాన్ని పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని అంగన్వాడి కేంద్రాల్లోని విద్యార్థులకు ప్రణాళిక ప్రకారం కంటి వైద్య పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. ఏమైనా లోపాలు గుర్తించిన పిల్లలకు మందులు అందజేయాలని సూచించారు. ఎక్కువ ఇబ్బంది పడే విద్యార్థులకు ప్రభుత్వ దవాఖానల్లో వైద్యం అందించాలని తెలిపారు. అనంతరం బస్వాపూర్ లోని ప్రాథమిక పాఠశాల, అంగన్వాడి కేంద్రాన్ని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు శాతం, పాఠాలు బోధిస్తున్న తీరు, విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరును పరిశీలించారు. జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం, జిల్లా వైద్యాధికారి రజిత, వైద్యులు నయీమాజహా, సంపత్, ఉపాధ్యాయులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి...



**బలగం టీవీ,ఎల్లారెడ్డిపేట**

రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ యువకుడు చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందిన సంఘటన ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్ గ్రామంలో విషాదం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం... నారాయణపూర్ గ్రామానికి చెందిన షేక్ ఆవేజ్ (18) హైదరాబాదులోని ఓ ప్రైవేట్ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు.రంజాన్ పండగ కోసం స్వగ్రామం రాగా, మార్చి 30 న పండగ షాపింగ్ కోసం ఆవేజ్ తన మిత్రుడు అఫ్రోజ్ తో కలిసి ద్విచక్ర వాహనం ( స్కూటీ) పై రాత్రి 9 గంటలకు సిరిసిల్ల కు వెళుతున్నాడు. ఈ క్రమంలో హరిదాస్ నగర్ లో ఎదురుగా ఆటో స్కూటీ ఢీకొట్టగా ఇద్దరు యువకులతో పాటు ఆటోలో ఉన్న వ్యక్తికి తలతో పాటు శరీరంలో పలు భాగాలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు,కుటుంబ సభ్యులు యువకుడికి మొదట ఎల్లారెడ్డిపేట లోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స అందించే ప్రయత్నం చేయగా మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. వెంటనే హుటాహుటిన హైదరాబాదులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్న క్రమంలో ఆదివారం రాత్రి మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. షేక్ సమద్ కు ఒక్కగానొక్క కొడుకు అతి చిన్న వయసులోనే రోడ్డు ప్రమాదానికి గురై కండ్ల ముందే చనిపోవడంతో ఆ యువకుడు కుటుంబం దుఃఖంలో మునిగిపోయింది. మృతిని పెద్దనాన్న షేక్ గౌస్ కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నేత కావడంతో పెద్ద సంఖ్యలో ప్రజా ప్రతినిధులు,ప్రజలు వారి కుటుంబాన్ని పరామర్శించి మృతదేహానికి నివాళులు అర్పించారు.

## కత్తి పట్టుకొని ప్రజలను భయబ్రాంతులకు గురి చేసిన వ్యక్తిపై కేసు

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**



ఇన్స్పెక్టర్ కె.కృష్ణ

పెద్ద కత్తి పట్టుకొని ప్రజలను భయబ్రాంతులకు గురి చేస్తూ భయానక వాతావరణం సృష్టించి బెదిరించిన వ్యక్తి పై కేసు నమోదైంది. సిరిసిల్ల పట్టణ ఇన్స్పెక్టర్ కె. కృష్ణ మాట్లాడుతూ వివరాలు వెల్లడించారు. నిందితుడు సలేంద్రి రాకేశ్ సిరిసిల్ల లోని ఇప్పల్లపల్లి నివాసుడు. కూలిపని చేస్తాడు. తాగుడుకు బానిసై గతంలో వేములవాడ లో ఒక దొంగతనం చేయగా జైలుకి వెళ్లి వచ్చాడు. అతడిని చూసి సిరిసిల్ల లోని ప్రజలు భయపడి, తద్వారా తను ఏమి చెప్పినా చేయాలని అనుకునేవాడు. దాని కొరకు తను సిరిసిల్ల లో భయానక వాతావరణం సృష్టించాలనే ఉద్దేశ్యంతో గత ఆరు నెలల క్రితం కరీంనగర్ కు వెళ్ళినపుడు గుర్తు తెలియని వ్యక్తి వద్ద పెద్ద కత్తిని కొనుక్కొని వచ్చి తన ఇంటివద్ద పెట్టుకొన్నాడు. ఆ పెద్ద కత్తిని మోటార్ సైకిల్ లో పెట్టుకొని తిరుగుతూ ప్రజలను భయబ్రంతులకు గురి చేయాలనీ నిర్ణయించుకొని, పెద్ద కత్తి తో పాటు, ప్యాంటు జేబులో చిన్న మడత కత్తి పెట్టుకొని తిరుగుతున్నాడు. తేది 05-04-2025 రోజున ఇప్పల్లపల్లి కి వెళ్ళగా అక్కడ మంది కనిపించగా వారు తనను చూసి భయపడాలని బండి కి ఉన్న పెద్ద కత్తి తీసి చేతిలో పట్టుకొని వారి వెంట పడుతూ చంపుతానని బెదిరిస్తూన్న సమయంలో పోలిసు అక్కడికి వెళ్లగా వారికి కూడా పెద్ద కత్తి చూపిస్తూ బెదిరించి వారి డ్యూటీ ని అడ్డుకొనగ అతడిని పట్టుకొని కేసు నమోదు చేసి రిమాండు చేశామని తెలిపారు.

## వేతనాలు రావడం లేదని ఎంపీడీవోకు వినతి పత్రం అందజేసిన ఫీల్డ్ అసిస్టెంట్లు



**బలగం టీవీ, బోయినిపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం. మూడు నెలలుగా వేతనాలు రావడం లేదని బోయినిపల్లి మండలం ఫీల్డ్ అసిస్టెంట్లు ఎంపీడీవో జయశీలకు మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం రోజున వినతి పత్రం అందజేశారు.గ్రామాల్లో ఉపాధి పని చేయిస్తున్న మాకు మూడు నెలలుగా వేతనాలు రాక కుటుంబాన్ని పోషించేందుకు ఇబ్బంది అవుతుందని వెంటనే వేతనాలు వచ్చేలా చూడాలని వినతిపత్రంలో పేర్కొన్నట్లు ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు తెలిపారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో మండల అధ్యక్షులు రంగు తిరుపతి, ప్రధాన కార్యదర్శి కుర్మ సురేష్, కోశాధికారి గోనే జయంత్, ఉపాధ్యక్షులు ఏ.దుర్గ ప్రసాద్, మహేందర్, కళ్యాణి, రమణారెడ్డి, శ్రీనివాస్, రాంప్రసాద్, స్వామి, మహేందర్ లు ఉన్నారు.

## రుద్రంగి గ్రామంలో తల్లి, కుమారుడు మృతి..

**-అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి విచారణ చేపట్టిన పోలీసులు**

**బలగం టీవీ, రుద్రంగి**

తల్లి కుమారుడు ఇద్దరు మృతి చెందిన సంఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండల కేంద్రంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం రుద్రంగి గ్రామానికి చెందిన కాదాస్ పుష్పలత(35), రాజు దంపతులకు కుమారుడు కాదాసు నిహాల్ తేజ్(6) ఉన్నాడు. రాజు ఉపాధి నిమిత్తం గల్ఫ్కు వెళ్ళాగా, పుష్పలత, వారి కొడుకు రుద్రంగిలోనే నివాసం ఉంటున్నారు. పుష్పలత శుక్రవారం ఇంటిలోనే చపాతీలు చేయగా కుమారుడితో కలిసి తిన్నారు. రాత్రి సమయంలో నిహాల్ తేజ్ కు వాంతులు కాగా దగ్గరలో ఉన్న ఆర్ఎంపీ వద్దకు తీసుకెళ్లారు. కొద్దిసేపటి తర్వాత పుష్పలతకు వాంతులు కాగా గ్రామంలోని ఆర్ఎంపి వద్ద చికిత్స తీసుకున్నారు. మరుసటి రోజు బాబుకు ఫిట్స్ రాగా, తల్లి పుష్పలతలను చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు కోరుట్లలోని ప్రైవేటు ఆస్పత్రికి తీసుకువెళ్లి అక్కడ నుండి ఇద్దరిని జగిత్యాల లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. నిహాల్ తేజకు మెరుగైన చికిత్స కొరకు కరీంనగర్ స్టార్ హాస్పిటల్ కు తరలించగా పరిస్థితి విషమించడంతో వరంగల్ ఎంజీఎం కు, తల్లి పుష్పలత పరిస్థితి కూడా విషమించడంతో కరీంనగర్ లోని ఓ ప్రయివేట్ హాస్పిటల్ తరలించారూ. చికిత్స పొందుతూ పుష్పలత ఆదివారం మృతి చెందగా నిహాల్ తేజ్ ఆరోగ్య పరిస్థితి విషమించడంతో ఎంజిఎం ఆస్పత్రిలో సోమవారం మృతి చెందాడు. తల్లి కొడుకులు ఇద్దరూ మృతి చెందడంతో రుద్రంగి గ్రామంలో విషాదం నెలకొంది. మృతుల మరణం పైన అనుమానం ఉన్నదని మృతురాలి సోదరుడు పాలెం శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మరణంగా కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నామని రుద్రంగి ఎస్సై సిరిసిల్ల అశోక్ తెలిపారు.

# వాంఖడేలో చరిత్ర సృష్టించిన ఆర్‌సీబీ

- ముంబై ఇండియన్స్‌పై 12 పరుగుల తేడాతో గెలుపు
- పదేండ్ల తర్వాత వాంఖడేలో గెలిచిన ఆర్‌సీబీ



**బలగం టీవీ, హైదరాబాద్**

రాయల్ చాలెంజర్స్ బెంగళూరు చరిత్ర సృష్టించింది. దాదాపు 10 ఏళ్ల తర్వాత వాంఖడేలో విజయం సాధించింది. సోమవారం ఉత్కంఠగా జరిగిన మ్యాచ్‌లో ఆర్‌సీబీ సంచలన ప్రదర్శన కనబర్చి మరో విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది. ముంబై ఇండియన్స్‌పై 12 పరుగుల తేడాతో ఆర్‌సీబీ విజయం సాధించింది.

ముందుగా బ్యాటింగ్ చేసిన ఆర్‌సీబీ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లకు 221 పరుగుల భారీ స్కోర్ చేసింది. విరాట్ కోహ్లీ(42 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్సర్లతో 67), రజత్ పటీదార్(32 బంతుల్లో 5 ఫోర్లు, 4 సిక్స్‌లతో 64) విధ్వంసకర హాఫ్ సెంచరీలతో చెలరేగారు. దేవదత్ పడిక్కల్(22 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్స్‌లతో 37), జితేశ్ శర్మ(18 బంతుల్లో 2 ఫోర్లు, 4 సిక్స్‌లతో 40 నాటౌట్) దూకుడుగా ఆడారు. ముంబై ఇండియన్స్ బౌలర్లలో హార్దిక్ పాండ్యా(2/45),ట్రెంట్ బౌల్ట్(2/57) రెండేసి వికెట్లు తీయగా.. విఘ్నేష్ పుతుర్‌కు ఓ వికెట్ దక్కింది. జస్‌ప్రీత్ బుమ్రా(0/29)పొదుపుగా బౌలింగ్ చేశాడు.

అనంతరం లక్ష్యచేధనకు దిగిన ముంబై ఇండియన్స్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లకు 209 పరుగులు చేసింది. తిలక్ వర్మ(29 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్స్‌లతో 56) హాఫ్ సెంచరీతో రాణించగా.. హార్దిక్ పాండ్యా(15 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్స్‌లతో 42) విధ్వంసకర బ్యాటింగ్‌తో చెలరేగాడు. ఆర్‌సీబీ బౌలర్లలో యశ్ దయాల్(2/46), జోష్ హాజెల్‌వుడ్(2/37) రెండేసి వికెట్లు తీయగా.. భువనేశ్వర్ కుమార్ ఒక వికెట్ పడగొట్టాడు. ఆఖరి ఓవర్‌లోనే కృనాల్ పాండ్యా 3 వికెట్లు తీయడం గమనార్హం. కీలక సమయంలో తిలక్ వర్మ, హార్దిక్ పాండ్యా ఔటకావడం ముంబై కొంప ముంచింది.



# మోడీని కలిసిన శ్రీలంక మాజీ క్రికెటర్లు..

**బలగం టీవీ, కొలంబో**

శ్రీలంకలో ప్రధాని మోడీ పర్యటించిన విషయం తెలిసిందే. ఆ సమయంలో లంక మాజీ క్రికెటర్లు మోదీని కలిశారు. జయసూర్య, అరవింద డిసిల్వా, కలువితరణ, చమిండ వాస్, కుమార ధర్మసేన కలిసిన వారిలో ఉన్నారు. 1996లో ప్రపంచ కప్ గెలిచిన ఆ బృందాన్ని మోదీ ప్రశంసించారు. ఆ రోజుల్లోనే టీ20 స్టయిల్ క్రికెట్ ఆడినట్లు ఆయన మెచ్చుకున్నారు. ఆర్థిక సంక్షోభంతో కొట్టుమిట్టాడుతున్న తమ దేశంలో టూర్ చేసేందుకు భారత జట్టును పంపినందుకు మోడీకి లంక మాజీ క్రికెటర్లు ధన్యవాదాలు తెలిపారు. అయితే ఈ భేటీ సందర్భంగా మాజీ ఓపెనర్ జయసూర్య మాట్లాడుతూ శ్రీలంకలో దాదాపు అంతటా క్రికెట్ ఆడుతామని, కానీ జాఫ్నాలో ఆడడం లేదని, శ్రీలంక క్రికెట్ కోచ్‌గా ఓ విజ్ఞప్తి చేస్తున్నానని, జాఫ్నాలో అంతర్జాతీయ క్రికెట్ స్టేడియాన్ని నిర్మించేందుకు సహకరించాలని మోడీని కోరాడు. ఒకవేళ స్టేడియాన్ని ఏర్పాటు చేస్తే అది జాఫ్నా ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందన్నాడు. జయసూర్య తమ సాయాన్ని కోరడం సంతోషంగా ఉన్నట్లు ప్రధాని మోడీ తెలిపారు. తన టీం ఈ విషయాన్ని నోట్ చేసుకుందన్నారు.

# నేడు అఖిల్ మూవీ టైటిల్ గ్లింప్స్

**బలగం టీవీ, హైదరాబాద్**




అఖిల్ 6 ప్రాజెక్ట్ అనౌన్స్‌మెంట్ లుక్ విడుదల చేశారు మేకర్స్. ప్రేమ కంటే హింసాత్మకమైన యుద్ధం మరొకటి లేదు.. అంటూ పిడికిల్ బిగించిన లుక్ ఒకటి రిలీజ్ చేశారు మేకర్స్. టైటిల్ గ్లింప్స్‌ను ఏప్రిల్ 8న విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. అఖిల్ చేతి మణికట్టుపై ఖడ్గంతో డిజైన్ చేసిన కడెంను చూడొచ్చు. అఖిల్ ఈ సారి ఏదో గట్టి ప్లాన్‌తోనే ప్రేక్షకుల ముందుకు రాబోతున్నట్లు తాజా లుక్ చెప్పకనే చెబుతోంది. వినరో భాగ్యము విష్ణు కథ ఫేం మురళీ కిశోర్ అబ్బూరు ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తుండగా.. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, అన్నపూర్ణ స్టూడియోస్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఎస్ థమన్ సంగీతం అందిస్తున్న ఈ మూవీకి సంబంధించి పూర్తి వివరాలు త్వరలోనే వెల్లడించనున్నారు మేకర్స్.



# ‘పెద్ది’ గ్లింప్స్ సెన్సేషన్ రికార్డు

**బలగం టీవీ, హైదరాబాద్**

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ ‘పెద్ది’ మూవీ ఫస్ట్ షాట్ యూట్యూబ్‌లో 31 మిలియన్లకు పైగా వ్యూస్‌తో ప్రస్తుతం నెంబర్ వన్‌గా ఉంది. ఈ క్రమంలో ఈ గ్లింప్స్ సరికొత్త రికార్డు నెలకొల్పింది. విడుదలైన 24 గంటల్లో అత్యధిక వ్యూస్ (31.15 మిలియన్లు) రాబట్టిన తెలుగు గ్లింప్స్‌గా నిలిచింది. అంతకుముందు ఈ రికార్డు జూనియర్ ఎన్‌టీఆర్ దేవర (26.17 మిలియన్లు) పేరిట ఉండగా... పెద్ది 18 గంటల్లోనే చెరిపేసింది. అయితే, దేవరకు 7 లక్షలకుపైగా లైక్స్ వస్తే... పెద్దికి మాత్రం 4 లక్షలకు పైగా వచ్చాయి. ఇక బుచ్చిబాబు సానా దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీలో చరణ్ సరసన బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తున్నారు. శివరాజ్ కుమార్, బాలీవుడ్ నటుడు దివ్యేందు, జగపతి బాబు తదితరులు ఇతర కీలక పాత్రల్లో కనిపించనున్నారు. మైత్రి మూవీ మేకర్స్, వృద్ధి సినిమాస్, సుకుమార్ రైటింగ్స్ సంస్థలు సంయుక్తంగా ఈ సినిమాను నిర్మిస్తున్నాయి. వచ్చే ఏడాది మార్చి 27న చెర్రీ పుట్టినరోజున పెద్ది విడుదల కానుంది.



# ఇషాంత్ శర్మకు జరిమానా

**బలగం టీవీ, హైదరాబాద్**

గుజరాత్ టైటాన్స్ పేసర్ ఇషాంత్ శర్మకు ఐపీఎల్ అడ్వైజరీ కమిటీ జరిమానా విధించింది. కీడా పరికరాలను అవమానించినందుకు గానూ మ్యాచ్ ఫీజులో 25శాతం జరిమానా, అలాగే ఓ డీమెరిట్ పాయింట్‌ను కేటాయించింది. ఆదివారం సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన మ్యాచ్?లో ఐపీఎల్ ప్రవర్తనా నియమావళిని ఇషాంత్ శర్మ ఉల్లంఘించినట్లు బీసీసీఐ ఓ ప్రకటనలో తెలిపింది. “ఇషాంత్ శర్మ ఐపీఎల్‌లోని ఆర్టికల్ 2.2 ప్రకారం లెవల్ 1 తప్పును అంగీకరించాడు. లెవల్ 1 ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనకుగానూ మ్యాచ్ రిఫరీ తీసుకున్న నిర్ణయానికి కట్టుబడి ఉన్నాడు” అని బీసీసీఐ విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది.

కాగా, ఐపీఎల్ ప్రవర్తనా నియమావళిలోని ఆర్టికల్ 2.2 ప్రకారం మ్యాచ్ సమయంలో క్రికెట్ పరికరాలు లేదా దుస్తులు, గ్రౌండ్ పరికరాలు దుర్వినియోగం చేసినవారికి జరిమానా విధిస్తారు. సాధారణ క్రికెట్ చర్యలకు విరుద్ధంగా ఉద్దేశపూర్వకంగా వికెట్లను కొట్టడం, తన్నడం, యాడ్ బోర్డులు, బౌండరీ కంచెలు, డ్రెస్సింగ్ రూమ్ తలుపులు, అద్దాలు, కిటికీలు, ఇతర ఫిక్చర్లలకు నష్టం కలిగించే విధంగా ప్రవర్తిస్తే ఈ విధమైన చర్యలు తీసుకుంటారు.

# హైదరాబాద్‌పై గుజరాత్ టైటాన్స్ గెలుపు

**బలగం టీవీ, హైదరాబాద్**

ఐపీఎల్-18లో సన్‌రైజర్స్ హైదరాబాద్ వరుస వైఫల్యాల పరంపర కొనసాగుతున్నది. ఇప్పటికే పాయింట్ల పట్టికలో అట్టడుగున నిలిచిన సన్‌రైజర్స్.. సొంతగడ్డపై గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన మ్యాచ్‌లోనూ పరాభవం పాలైంది. గుజరాత్ టైటాన్స్ చేతిలో సన్‌రైజర్స్ 7 వికెట్ల తేడాతో పరాజయం పాలైంది. శుభ్‌మన్ గిల్ (61 నాటౌట్) కెప్టెన్సీ ఇన్నింగ్స్‌తో మెరువగా.. వాషింగ్టన్ సుందర్ (49), రూథర్‌ఫోర్డ్ (35 నాటౌట్) రాణించటంతో 16.4 ఓవర్లలోనే గుజరాత్ టైటాన్స్ లాంఛనం ముగించింది. ఐపీఎల్18లో ఐదు మ్యాచుల్లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు ఇది నాల్గో పరాజయం.



టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు వచ్చిన సన్‌రైజర్స్‌కు ఆశించిన ఆరంభం దక్కలేదు. ఓపెనర్లు మరోసారి నిరాశపరిచారు. లోకల్‌హీరో, మియాభారు మహ్మద్ సిరాజ్ (4/17) పవర్‌ప్లేలో నిప్పులు చెరిగాడు. ట్రావిశ్ హెడ్ (8), అభిషేక్ శర్మ (18)లను ట్రాప్ చేసిన సిరాజ్.. సన్‌రైజర్స్ దారుణంగా దెబ్బతీశాడు. పవర్‌ప్లేలో 45/2తో నిలిచిన సన్‌రైజర్స్ మళ్లీ కోలుకోలేదు. ఇషాన్ కిషన్ (17) సైతం ఎంతోసేపు వికెట్ నిలుపుకోలేదు. ఈ దశలో నితీశ్ కుమార్ రెడ్డి (31), హెన్రిచ్ క్లాసెన్ (27) కీలక భాగస్వామ్యం నిర్మించారు. 39 బంతుల్లో 50 పరుగులతో ఇన్నింగ్స్‌ను నిలబెట్టే ప్రయత్నం చేశారు. స్పిన్నర్ సాయి కిశోర్ (2/24) ఈ ఇద్దరిని సాగనంపి సన్‌రైజర్స్ మళ్లీ కష్టాల్లోకి నెట్టాడు. అనికెత్ వర్మ (18), పాట్ కమిన్స్ (22 నాటౌట్) మెరుపులతో సన్‌రైజర్స్ 150 ప్లస్ పరుగులు చేయగల్గింది. టైటాన్స్ బౌలర్లలో ప్రసిద్ కృష్ణ (2/25) రెండు వికెట్లతో మెరిశాడు.

అనంతరం బ్యాటింగ్ చేసిన గుజరాత్ టీంలో శుభ్‌మన్ గిల్ (61 నాటౌట్, 43 బంతుల్లో 9 ఫోర్లు) అజేయ అర్ధ సెంచరీతో చెలరేగాడు.ఏడు ఫోర్లతో 36 బంతుల్లోనే అర్ధ సెంచరీ సాధించిన శుభ్‌మన్ గిల్‌కు తోడుగా వాషింగ్టన్ సుందర్ (48, 29 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్స్‌లు), రూథర్‌ఫోర్డ్ (35 నాటౌట్, 16 బంతుల్లో 6 ఫోర్లు, 1 సిక్స్) రాణించటంతో 16.4 ఓవర్లలోనే 153/3 పరుగులు చేసిన గుజరాత్ టైటాన్స్ 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. మహ్మద్ షమి (2/28), పాట్ కమిన్స్ (1/26) ఆకట్టుకునే ప్రదర్శన చేసినా.. ఇతర బౌలర్లు తేలిపోయారు. పవర్ ప్లేలో 48/2తో నిలిచిన టైటాన్స్‌ను వాషింగ్టన్ సుందర్, శుభ్‌మన్ గిల్ జోడీ 56 బంతుల్లో 90 పరుగుల భారీ భాగస్వామ్యంతో నిలబెట్టింది. మిడిల్ ఓవర్లలో సుందర్, గిల్ భాగస్వామ్యమే మ్యాచ్‌ను సన్‌రైజర్స్‌కు దూరం చేసింది.




# ‘గుడ్ బ్యాడ్ అగ్లీ’ తెలుగు ట్రైలర్ విడుదల

**ఏప్రిల్ 10న సినిమా..**

**బలగం టీవీ, హైదరాబాద్**

కోలీవుడ్ స్టార్ అజిత్ కుమార్ హీరోగా అధిక్ రవిచంద్రన్ దర్శకత్వంలో వస్తున్న తాజా చిత్రం ‘గుడ్ బ్యాడ్ అగ్లీ’. ఈ మూవీ ఏప్రిల్ 10న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ క్రమంలో తెలుగు ట్రైలర్‌ను తాజాగా మేకర్స్ విడుదల చేశారు. మాస్, యాక్షన్ ఎంటర్టైనర్‌గా రాబోతోన్న ఈ చిత్రంలో అజిత్ సరసన కథానాయికగా త్రిష నటిస్తోంది. ఇతర కీలక పాత్రల్లో అర్జున్ దాస్, సునీల్ నటిస్తున్నారు. అనిరుధ్ రవిచంద్రన్ సంగీతం అందిస్తున్నారు.